సాక్షి
కామారెడ్డి
గురువారం : 27 : ఫిబ్రవరి : 2025



త్రిలింగేశ్వరాలయానికి..

తాండూర్ త్రిలింగేశ్వరాలయానికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు.

- 9లో ▸



తాగునీటి సమస్యను..

గిరిజన తండాలు, గ్రామాల్లో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆదేశించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /16.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక



ఝాన్సీరాణి, రక్షిత

కామారెడ్డి అర్బన్: సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌కు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపిక య్యారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్, చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు ఎంపిక య్యాయి. గర్గుల్‌కు చెందిన సీహెచ్ ఝాన్సీ రాణి, కే రక్షిత, చిన్నమల్లారెడ్డికి చెందిన నివేదిక రాష్ట్రపతి నిలయంలో నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొననున్నారు.

డ్రోన్ వినియోగంపై ఉచిత శిక్షణ

డొంకేశ్వర్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో గ్రామీణ యువ రైతులకు డ్రోన్ వినియోగంపై ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు టెక్నాలజీ మేనేజర్ భరత్ కుమార్ తెలిపారు. పదో తరగతి పాసై 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడతగా పదిహేను మందికి శిక్షణ ఇస్తామని, ఆసక్తి గలవారు మూడు రోజుల్లోగా కలెక్టరేట్‌లోని రూం నంబర్ 101లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440687698ను సంప్రదించాలని సూచించారు.

తల్లిని హత్య చేసిన తనయుడు

- తమ్ముడి హత్య కేసులో రాజీ చేసుకోవాలని ఒత్తిడి
- ఒప్పుకోనందుకు రోకలి దుడ్డుతో తలపై బాదడంతో మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం: తమ్ముడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అన్న రాజీ చేసుకోవాలని కన్న తల్లిని కోరగా ఆమె ససేమిరా అనడంతో రోకలి దుడ్డుతో తలపై బాది హత్య చేసిన ఘటన పిట్లంలో చోటు చేసుకుంది. సీఐ రాజేశ్, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన సాబేరా బేగం (60)కు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. 2021లో రెండో కుమారుడైన షాదుల్ మూడో కుమారుడైన ముజీబ్‌ను ఆస్తి తగదాల విషయంలో గొడవపడి హత్య చేశాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ కేసును రాజీ చేసుకోవాలని నిందితుడు షాదుల్ తల్లిని మంగళవారం కోరాడు. దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో ఆగ్రహంతో ఇంట్లో ఉన్న రోకలి దుడ్డుతో తలపై పలుమార్లు బాదాడు. తీవ్రగాయాలైన సాబేరా బేగంను కుటుంబ సభ్యులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేసుకొని వివరాలు సేకరించారు. మృతురాలి పెద్దకుమారుడు అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.



మద్దికుంట బుగ్గరామలింగేశ్వరుడి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం..

హరహర మహాదేవ్..

మహాశివరాత్రి పర్వదినాన నమఃపార్వతీపతయే హరహర మహాదేవ్.. అంటూ శైవ క్షేత్రాలు మారుమోగాయి. భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భోళాశంకరుడికి అభిషేకాలు చేశారు.

భిక్కనూరులోని సిద్ధరామేశ్వరాలయం, దుర్కి సోమలింగేశ్వరాలయం, తాండూర్ త్రిలింగేశ్వరాలయం, బండరామేశ్వరపల్లి రాజరాజేశ్వరాలయం, ఎల్లారెడ్డిలోని నీలకంఠేశ్వరాలయం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తులు ఉపవాస దీక్ష ఆచరిస్తూ, జాగరణ చేసి మహాదేవునికి ప్రత్యేక పూజలు చేశారు.



దుర్కి సోమలింగేశ్వరాలయంలో భక్తుల పూజలు



మద్దికుంటలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..

54 పోలింగ్ కేంద్రాలు.. 18421 మంది ఓటర్లు

నేడే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..
- పట్టభద్రులకు 29.. టీచర్లకు 25 పోలింగ్ కేంద్రాలు
- కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. పక్షం రోజులుగా ఆయా పార్టీలు, సంఘాల అభ్యర్థులు, వారి తరఫున నాయకులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. అయితే గురువారం జరగనున్న పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఎన్నిక కోసం 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 16,410 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనుండగా, అందులో 11,616 మంది పురుషులు, 4,793 మంది మహిళలు, ఒక థర్డ్ జెండర్ ఉన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,011 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,307 మంది పురుషులు, 704 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



మహమ్మద్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది, పోలీసులు

నిజాంసాగర్‌లో 9 మంది ఓటర్లు

నిజాంసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రంలో కేవలం 9 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. డోంగ్లీలో 11 మంది, మహ్మద్‌నగర్‌లో 14 మంది, పాల్వంచలో 15 మంది ఉన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 941 మంది ఉన్నారు.

కేంద్రాలకు చేరిన సిబ్బంది

పోలింగ్ నిర్వహణకు కేటాయించిన సిబ్బంది బుధవారం సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకు న్నారు. అన్ని మండల కేంద్రాల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులకు ఒక్కో కేంద్రం ఏర్పాటు చేయగా, జిల్లా కేంద్రంలో పట్టభద్రులకు అదనంగా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాను ఎనిమిది రూట్లుగా విభజించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఓటేసేది ఎంత మందో..?

ఉపాధ్యాయులతోపాటు పట్టభద్రులను అభ్యర్థులు, నాయకులు పలుమార్లు కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. అయితే చాలా మంది కుంభమేళాకు వెళ్లడం, అలాగే బుధవారం శివరాత్రి పండగ, జాగారం వంటి కారణాలతో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తుతారా? లేదా? అన్నదానిపై అభ్యర్థుల్లో కొంత ఆందోళన ఉంది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాలి

- ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని తెలపాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 8 రూట్లలో 54 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించాలని, ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియపర్చాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు వి విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

పోలింగ్ సిబ్బంది ఇలా..

ప్రిసైడింగ్ అధికారులు	48
సహాయ ప్రిసైడింగ్ అధికారులు	48
ఓపీవోలు	116
మైక్రో పరిశీలకులు	52

నిర్లక్ష్యపు నిప్పు అడవికి ముప్పు



నాగిరెడ్డిపేట ఫారెస్ట్‌రేంజ్ పరిధిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

- అటవీప్రాంతాల్లో తరచూ అగ్నిప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు
- నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండగా.. అడవుల్లో అగ్ని ప్రమాదాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్ని ప్రమాదాల నివారణపై అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ తరచూ అటవీప్రాంతాల్లో ఎక్కడో ఓ చోట అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫారెస్ట్ అధికారులకు సకాలంలో సమాచారం అందుతుండడంతో వారు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. అధికారులు ఘటనాస్థలానికి చేరుకోవడం ఆలస్యమైతే ఎంతో విలువైన వన సంపద కాలిపోవడంతోపాటు వన్యప్రాణులకు హాని కలుగుతుంది. ఈ క్రమంలో ఫారెస్ట్ అధికారులు అటవీప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా సమీపప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు అటవీప్రాంతాల్లో ఫైర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. అటవీప్రాంతాల మీదుగా ప్రయాణించే వారు బీడీ, సిగరెట్‌లను ఆర్పకుండా పారవేసినప్పుడు అగ్గి రాజుకుని మంటలు వ్యాపిస్తున్నాయి. ప్రతి ఏడాది అటవీప్రాంతం చుట్టూ ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తుండగా, ఈ ఏడాది బడ్జెట్ కొరత కారణంగా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది.

జిల్లాలో అటవీ విస్తీర్ణం హెక్టార్లలో

కామారెడ్డి డివిజన్	42,524.54
బాన్సువాడ డివిజన్	39,665.94
మొత్తం విస్తీర్ణం	82,190 హెక్టార్లు

అందరి బాధ్యత

అటవీ సంపద సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా భావించాలి. అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అటవీప్రాంతంలోకి వెళ్లే బాటసారులతోపాటు పశువుల, మేకల, గొర్ల కాపర్లు బీడీ, సిగరెట్లు వెలిగించి పొరపాటున నిప్పు ఆర్పకుండా పడేయడంతో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. అటవీ ప్రాంతాల సమీపంలోని వ్యవసాయ భూముల్లో పంట వ్యర్థాలను కాల్చేక్రమంలో మంటలు అటవీప్రాంతానికి విస్తరిస్తున్నాయి.

కామారెడ్డి బల్దియాకు ఊరట

- స్టాంపు డ్యూటీ బకాయిలు రూ. 14.18 కోట్లు విడుదల
- నిధుల వినియోగంపై మార్గదర్శకాలు జారీ

కామారెడ్డి టౌన్: ఖజానాలో డబ్బులు లేక ఆర్థిక సంక్షోభంలో ఉన్న బల్దియాకు కాస్త ఊరట లభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్టాంపు డ్యూటీ, ఆస్తి మార్పిడి రుసుముకు సంబంధించిన బకాయిలు ఇటీవల విడుదలయ్యాయి. 2019 నుంచి 5ఏళ్ల పాటు స్టాంపు డ్యూటీ, 2022 నుంచి ఆస్తి మార్పిడి రుసుము ద్వారా వచ్చిన పన్ను బకాయిల వాటా రూ.14.18 కోట్లు బల్దియా ప్రత్యేక ఖాతాలో జమయ్యాయి. దీంతో బల్దియాకు ఊరట లభించింది. నిధులను ఎలా ఖర్చు చేయాలనేదానిపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

వేతనాలు, విద్యుత్ బిల్లులకు..

రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు స్టాంపు డ్యూటీ బకాయిలను విడుదల చేయడంతోపాటు వాటి వినియోగంపై కూడా మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కార్యాలయాల విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే ఈ డబ్బులు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వార్డుల్లో సీసీ రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించొచ్చని స్పష్టం చేసింది. అయితే కొందరు కాంట్రాక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు వారికి రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం ఈ నిధుల నుంచి చెల్లించాలని అధికారులపై ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆంక్షలతో బిల్లులు చెల్లించడానికి అధికారులు ఒప్పుకునే పరిస్థితి లేదు.

రెగ్యులర్‌గా చెల్లిస్తే మేలు

మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలు, వాణిజ్య భవనాలు, నివాస భవనాలు క్రయ, విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు అయితే 0.5 శాతం స్టాంపు డ్యూటీ డబ్బులు మున్సిపాలిటీలకు చెల్లించాలి. గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మున్సిపాలిటీల ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమ చేసేవారు. కానీ 2019లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ డబ్బులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లాయి. దీంతో ఐదేళ్లుగా స్టాంపు డ్యూటీ డబ్బులు రాకపోవడంతో బల్దియాలకు ఆదాయం తగ్గింది. ప్రతి ఆరు నెలలకోసారి స్టాంపు డ్యూటీ డబ్బులు విడుదల చేస్తే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

మార్గదర్శకాల ప్రకారమే..



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు విడుదల చేసి ప్రత్యేక ఖాతాల్లో జమ చేసిన స్టాంపు డ్యూటీ డబ్బులు ఎలా ఖర్చు చేయాలో మార్గదర్శకాలు, ఆంక్షలతో ఉత్తర్వులను జారీ చేసింది. ఆ మేరకు ఖర్చు చేస్తున్నాం. కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులకు మాత్రమే చెల్లించాల్సి ఉంది. ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

నాగిరెడ్డిపేట/లింగంపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట ఉన్నత పాఠశాల, లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ ఓటర్ల వివరాలను తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, నరేందర్ గౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించాలన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంతో పాటు నిజాంసాగర్ పోలింగ్ కేంద్రాలను బుధవారం స్థానిక తహసీల్దార్లు సవాయిసింగ్,భిక్షపతి సందర్శించారు.వారి వెంట స్థానిక ఎస్సై శివకుమార్ తదితరులున్నారు.

చెత్త సేకరణ వాహనాల రిపోర్టు ఇవ్వండి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బోధన్‌టౌన్(బోధన్): బల్దియాలోని శానిటేషన్ విభాగంలో చెత్త సేకరణకు సంబంధించిన వాహనాల వివరాల రిపోర్టును గురువారం సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ కమిషనర్ వెంకట్ నారాయణకు సూచించారు. అదనపు కలెక్టర్ బల్దియా కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చెత్త సేకరించే వాహనాలను పరిశీలించారు. చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు ఉపయోగిస్తున్నామని, ఎంత చెత్త సేకరిస్తున్నామని వివరాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కొన్ని చెత్త ఆటోలు, స్వీపింగ్ మిషన్ పని చేయడంలేదని తెలిపారు. త్వరగా మరమ్మతులు చేయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

బంగారు గొలుసు అప్పగింత



బంగారం గొలుసును మహిళకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ఓ మహిళ పోగొట్టుకున్న మూడు తులాల బంగారం గొలుసు ఆచూకీని కామారెడ్డి పట్టణ పోలీసులు గుర్తించి బుధవారం అప్పగించారు. పాల్వంచ మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన చిన్నం వెంకటలక్ష్మి ఈనెల 24న కామారెడ్డికి వచ్చి ఓ దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తుండగా ఆమె బ్యాగులో ఉన్న బంగారం గొలుసు కిందపడిపోయింది. గొలుసు పోయినట్లు బుధవారం ఉదయం చూసుకున్న ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు రెండు రోజుల క్రితం అదే దుకాణానికి వచ్చిన సిరికొండ మండలం గడ్డమీది తండాకు చెందిన భుక్యా కాశీరాం, రంభ దంపతులకు దొరికినట్లు గుర్తించారు. వారిని పిలిపించి గొలుసు స్వాధీనం చేసుకుని వెంకటలక్ష్మికి అప్పగించారు. బంగారు గొలుసును అప్పగించిన కాశీరాం దంపతులను, గొలుసు ఆచూకీ గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజు, విజయ్, విశ్వనాథ్, నర్సింలు ను ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

బెల్ట్‌షాప్‌లపై దాడి

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని అమ్దాపూర్, ఊట్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. రూ.13 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని, నిర్వాహకులపై కేసు నమోదు చేశామన్నారు.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

- రెండు నెలలుగా ముందుకు సాగని పనులు
- మధ్యలో ఆగిపోవడంతో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, వ్యాపారులు
- పనులు పూర్తి చేయాలని కోరుతున్న స్థానికులు



పిట్లంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా డ్రెయినేజీ కోసం తవ్వి వదిలేసిన గుంత



టెంట్లు వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్న దృశ్యం

పిట్లం(జుక్కల్): గతేడాది జులైలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.12 కోట్లతో మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. కొన్ని రోజులు రోడ్డు విస్తరణ పనులను చేపట్టి రోడ్డుకు ఇరువైపులా గుంతలు తవ్వి కంకర వేశారు. ఒక వైపు డ్రైనేజీ గుంతను తీశారు. రెండు నెలలుగా పనులను నిలిపివేశారు. దీంతో వాహనదారులు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంకర వేసి వదిలేయడంతో వాహనాలు నిలపడానికి, ఆటోలు ఆపడానికి స్థలం లేక పలుమార్లు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఒక వైపు డ్రైనేజీ కోసం గుంతను తవ్వి అలాగే వదిలేయడంతో రోడ్డుపై నుంచి దుకాణాలలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గత్యంతరం లేక పలు దుకాణదారులు డ్రైనేజీ కోసం తవ్విన గుంతపై చెక్కలు వేసి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అయినా గుంతపై వేసిన చెక్కలపై నడిచేటప్పుడు కిందపడే అవకాశం ఉందని ప్రజలు దుకాణాలకు రావడంలేదని, దీంతో గిరాకీలు లేక వ్యాపారాలు తగ్గిపోయాయి. రోడ్డు విస్తరణ వనుల ఆగిపోవడం వల్ల విపరీతంగా దుమ్ము లేస్తోంది. దుకాణాలలో గిరాకీలు తగ్గిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితేనే వ్యాపారం చేసుకోవచ్చని అప్పటి వరకు తిప్పలు తప్పవని దుకాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని వ్యాపారులు, వాహనదారులు కోరుతున్నారు.

గిరాకీలు తగ్గిపోయాయి



దుకాణాలలో గిరాకీలు తగ్గిపోయాయి. విస్తరణ పనుల్లో భాగంగా దుకాణం ఎదుట చేపట్టిన రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దుకాణల ముందు డ్రైనేజీ కోసం పెద్ద గుంత తవ్వి వదిలేశారు. దీనివల్ల దుర్వాసన వెదజల్లుతోంది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వ్యాపారులు చాలా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది.

– బుక్క లింగం, వ్యాపారి, పిట్లం

ఆటోలు పెట్టుకోడానికి స్థలం లేదు



రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ఒక వైపు డ్రైనేజీ కోసం గుంత తవ్వి వదిలేయంతో ఆటోలు ఆపడానికి స్థలం లేకుండా పోయింది. రో డ్డు చివర ఆటోలు ఆపినా ట్రాఫిక్ జామ్ అవుతోంది. 8 నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం మ హిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించిన తర్వత మా ఆటోవాలాల బతుకులు ఆగం అయ్యాయి. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలి.

– సయ్యద్ ఇమ్రాన్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్

ఖాతాల్లో జమకాని ఎక్స్‌గ్రేషియా

మోస్రా మండల కేంద్రానికి చెందిన పురాణం శ్రీనివాస్ నాలుగు నెలల క్రితం ఒమాన్‌లో అనారోగ్యంతో మృతిచెందాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరవుతుందనే ఆశతో మృతుడి భార్య పద్మ కలెక్టరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంది. కానీ ఇప్పటి వరకు ఆమె ఖాతాలో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ కాలేదు. ఇది ఒక్క పద్మకే కాదు జిల్లాలో మరో 34 కుటుంబాలకు రాష్ట్ర వ్యాప్తంగా వందలాది కుటుంబాలకు ఏర్పడిన దయనీయ స్థితి.

- ఏడాదిగా గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు అందనిసాయం
- ప్రొసీడింగ్ జారీ చేసినా అందని పరిస్థితి
- నిరాశలో గల్ఫ్ మృతుల కుటుంబాలు

మోర్తాడ్: తాము అధికారంలోకి వస్తే గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందుకు అనుగుణంగానే 7.12.2023 తర్వాత గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి వివరాలను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది. 21.10.2024న బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు పత్రాలను ప్రభుత్వం అందజేసింది. కానీ ఇప్పటి వరకు నయాపైసా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. తొలి విడతలో రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలకు సాయం అందింది. ఆ ఉత్తర్వులకు కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 కుటుంబాలకు రూ.6.45 కోట్లు విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మరో ఉత్తర్వు జారీ చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను గుర్తించి వారి ద్వారా కలెక్టర్లకు దరఖాస్తులు అందించి సాయం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రొసీడింగ్‌లను మాత్రమే అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఖాతాలను ప్రభుత్వం సేకరించినా నిధులను విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై మృతుల కుటుంబాలు నిరాశ చెందుతున్నాయి.

ఖాతాల్లో జమ చేయాలి

గల్ఫ్ మృతుల కుటుంబాలకు భరోసా ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదల విషయంలో నిర్లక్ష్యం వహించడం తగదు. గల్ఫ్ మృతుల్లో అందరూ పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉన్నారు. మానవతా దృక్పథంతో సాయం సొమ్మును వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు

క్రైం కార్నర్

రుణం ఇప్పిస్తానని బంగారు గొలుసు చోరీ

భిక్కనూరు: రుణం ఇప్పిస్తానని నమ్మించిన ఓ అగంతకుడు మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన లక్ష్మి వెదురు బొంగుల వ్యాపారం చేస్తుంది. బుధవారం సాయంత్రం లక్ష్మి, కుమారుడు ఆంజనేయులు ఇంట్లో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. తాను రామాయంపేటలో ఉంటానని ఇంట్లో నిర్వహించే ఫంక్షన్‌కు వెదురు బొంగులు, తడకలు కావాలని నమ్మించాడు. మరిన్ని విషయాలు అక్కడే మాట్లాడదామని చెప్పి వారి ఫోన్ నంబర్లు తీసుకొని వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి ఆంజనేయులు రామాయంపేటకు వెళ్లాడు. ఈ క్రమంలో అగంతకుడు భిక్కనూరులోనే ఉండి లక్ష్మికి ఫోన్ చేసి మీరు బాగా కష్టపడుతున్నారని రూ. లక్ష రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. దీని కోసం మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్‌కు రావాలని, వచ్చే సమయంలో మెడలో ఎలాంటి బంగారం ఉండకూడదని చెప్పాడు. అతని మాటలు నమ్మిన లక్ష్మి ఇంట్లో ఉన్న చెక్కపెట్టెలో బంగారు గొలుపు పెట్టి బస్టాండ్‌కు వెళ్లింది. తీరా అక్కడ అతను లేకపోవడంతో ఇంటికి వచ్చిన లక్ష్మి తన బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు గుర్తించింది. అగంతకుడే బంగారు పుస్తెల తాడును అపహరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తాడ్వాయి: కుటుంబ కలహాలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సావిత్రి(40), లక్ష్మణ్ దంపతులు. సావిత్రి చెల్లెలు కవితను కూడా లక్ష్మణ్ రెండో వివాహం చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరు బా గానే ఉన్నారు. ఈ నెల 19న లక్ష్మణ్ మద్యం తాగి మొదటి భార్య సావిత్రితో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురైన సావి త్రి అదే రోజు పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబీకులు ఎల్లారెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు నితీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సావిత్రి మృతదేహం

భీమ్‌గల్‌లో బాలుడు..

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణానికి చెందిన బాలుడు చార్విక్ (3) ప్రమాదవశాత్తు సాంబార్ గిన్నెలో పడి మృతి చెందాడు. కర్నె నిహారిక తన కుమారుడు చార్విక్‌తో కలిసి ఈనెల 19న ముచ్కూర్‌లోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. అక్కడ ఆడుకుంటున్న చార్విక్ ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న సాంబార్ గిన్నెలో పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన చార్విక్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమ్‌గల్ పోలీసులు తెలిపారు.

జిల్లా కేంద్రంలో గుర్తుతెలియని మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 23న ఆర్టీసీ బస్టాండ్ దగ్గర గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి వయస్సు 45 ఏళ్ల లోపు ఉంటుందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఒకటో టౌన్ పీఎస్‌లో, 8712659714 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంతలోకాలకు..


- గోదావరిలో మునిగి యువకుడి మృతి



వర్ధన్ మృతదేహం

రెంజల్: మహా శివరాత్రి సందర్భంగా నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నది (త్రివేణి సంగమం)లో పుణ్యస్నానానికి వచ్చిన ఓ యువకుడు నీటిలో మునిగి చనిపోయాడు. బోధన్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన వర్ధన్ (23) మిత్రుడితో కలిసి బుధవారం కందకుర్తికి వచ్చాడు. ఇద్దరు కలిసి నదిలోని మొదటి ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా వర్ధన్ కాలు జారి నీటిలో పడి మునిగిపోయాడు. వెంటనే ఒడ్డుకు చేరుకున్న మిత్రుడు 108 అంబులెన్స్‌కు కాల్ చేశాడు. అంబులెన్స్ వచ్చే సరికి అక్కడున్న భక్తులు నీట మునిగిన వర్ధన్ బయటకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాడ్‌బిలోలిలో ఒకరి అదృశ్యం



పోశెట్టి

రెంజల్: రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాకిన్‌గారి పోశెట్టి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న ఇంటి నుంచి వెళ్లిన పోశెట్టి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

నందిపేట్: అయిలాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ కస్పా శ్యామ్‌పై నందిపేట పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమలాపూర్‌కు చెందిన నరసింహమూర్తిని ఉద్యోగం నిమిత్తం గల్ఫ్‌కు పంపిస్తానని చెప్పి శ్యామ్ రూ.లక్షల్లో వసూలు చేశాడు. మోసం జరిగిందని భావించిన బాధితుడు తిరిగి తన డబ్బులు ఇవ్వాలని శ్యామ్‌ను కోరాడు. దీంతో తనపై శ్యామ్‌తో పాటు మధు, సాయారెడ్డి, గుడ్ల ప్రకాశ్ దాడికి పాల్పడినట్లు బాధితుడు నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నకిలీ ఏజెంట్‌తో పాటు మరో ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): గిరిజన తండాలు, గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ అధికారులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. బుధవారం జుక్కల్ క్యాంపు కార్యాలయానికి పెద్దకొడప్‌గల్, కాటేపల్లి, జుక్కల్ మండలాల ప్రజలు తరలి వచ్చారు. తాగు నీరు లేక తల్లడిల్లుతున్నామని కాటేపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. పెద్దకొడప్‌గల్‌లో బోరుమోటార్ల ఇబ్బందులు ఉన్నాయని తాగు నీటికి తిప్పలు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే..సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సింగిల్ ఫేజ్ మోటార్లు, త్రీఫేజ్ బోరుమోటార్లకు మరమ్మతులు చేపట్టి సిద్ధంగా ఉంచాలన్నారు. నీటి ఎద్దడి నివారణకు అవసరమైన నిధులు మంజూరుకు తన వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

బండాయప్ప మఠంలో శివరాత్రి వేడుకలు



కైలాస పర్వతం సెట్



పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని సద్గురు బండాయప్ప మఠంలో పీఠాధిపతి సోమలింగ శివాచార్య ఆధ్వర్యంలో బుధవారం మహా శివరాత్రి, శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు శివాలయాన్ని సందర్శించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్యులను ఎమ్మెల్యే కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కై లాస పర్వతం స్టేజ్ పై 25 అడుగుల పరమ శివుడి ప్రతిమను ప్రతిష్ఠించారు. నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, గంగాధర్, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేజీపైకి వస్తున్న బండాయప్ప మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్యులు

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



సంగవ్వ మృతదేహం

లింగంపేట: లింగంపేట మండలంలోని మోతె గ్రామానికి చెందిన పాగల సంగవ్వ(53) మతిస్థిమితం కోల్పోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భర్త భూమయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా కొన్ని రోజులుగా ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. తన భర్త ఆరోగ్యం బాగవడం లేదనే బెంగతో సంగవ్వ మతిస్థిమితం కోల్పోయింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామ శివారులోని కుంటలో పడి ఉన్నట్లు గుర్తించిన కుమారుడు కిషన్ తల్లినిఆస్పత్రికి తరలించాడు. కాగా అప్పటికే ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భయంతో యువకుడు ..



రాంసింగ్ (ఫైల్)

రెంజల్: రెంజల్ మండలంలోని వీరన్నగుట్టకు చెందిన జాదవ్ రాంసింగ్(34) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబీకులు ఇంటి బయట నిద్రించగా రాంసింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్ధరాత్రి గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని ఓ యువకుడు చంపుతానని బెదిరించడం వల్లే తన తమ్ముడు భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న రామారావు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

ఖలీల్‌వాడి: కుంభమేళాకు వెళ్లి తిరిగొచ్చిన వచ్చిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కోటగల్లీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి(48) డ్రైవర్‌గా పని చేస్తాడు. ఈనెల 15న కారు డ్రైవింగ్‌పై నిజామాబాద్ నుంచి కుంభమేళాకు వెళ్లాడు. 17న రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్నా ఇంటికి వెళ్లలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. 24న కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యా దు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు నవీపే ట మండలం గాంధీనగర్ శివారులో గుర్తు తెలియ ని మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. బాధిత కు టుంబీకులకు చూపించగా అది శ్రీనివాస్‌రెడ్డి మృత దేహంగా పేర్కొన్నారు. మృతుడు ఐదు రోజులుగా గాంధీనగర్‌లో పిచ్చివాడిలా తిరుగుతూ కనిపించినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందని ఎస్సై చెప్పా రు. మృతుడికి మద్యం, కల్లు తాగే అలవాటుతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు..

ఖలీల్‌వాడి: స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన నగరంలోని నిజాం కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నిజాంకాలనీకి చెందిన సయ్యద్ అష్రాఫ్(22) స్థానికంగా ఉండే ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నాడు. బుధవారం స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు దిగాడు. అతనికి ఈత రాకపోగా, అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటమునిగి మృతి చెందాడు.

నిప్పంటించడంతో గుడిసె దహనం

- రూ. మూడు లక్షలు విలువ చేసే ఇంటి సామగ్రి దహనం



దగ్ధమైన గుడిసె ఎదుట బాధితులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మల్లారెడ్డి చెరువు సమీపంలో ఉన్న ఓ గుడిసెకు దుండగులు నిప్పంటించడంతో పూర్తిగా దహనమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పరిపూర్ణం అనే వ్యక్తి కొన్నేళ్లుగా చెరువు సమీపంలో గుడిసె వేసుకొని జీవిస్తున్నాడు. ఇటీవల పట్టణంలో నూతన భవన నిర్మాణం చేపడుతున్నాడు. గుడిసెలో తలుపులు, కిటికీలు ఇతర నిర్మాణ సామగ్రి నిలువ చేశాడు. బుధవారం మధ్యాహ్నం దుండగులు ఎవరూ లేని సమయంలో గుడిసెకు నిప్పంటించారు. ఈ ఘటనలో తనకు రూ. మూడు లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

పట్టపగలే చోరీ

మాక్లూర్: మాక్లూర్ మండల పరిధిలోని ఆర్టీసీ కాలనీలో దుండగులు పట్టపగలే ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన రవి ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని రాంచంద్రాపల్లిలో ఉన్న ఆలయానికి వెళ్లాడు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆలయం నుంచి వచ్చిన కుటుంబీకులు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఖంగుతున్నారు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 22 గ్రాముల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.